# సరస్వతీపూజ

"కొయ్యబొమ్మలు మెచ్చుకళ్ళకు
కోమలుల సౌ రెక్కునా?"

౧

ఆవూరు వెళ్ళడము నాకదే ప్రథమము. ఊరంటే మరేమీ ప్రసిద్ధమైన ఊరుకాదది, అన్ని ఊళ్ళవంటిదే అని మొదట నే ననుకొన్నాను. కాని రెండురోజులపాటు ఆ ఊళ్లో ఉండడముతోనే అక్కడి విశేషమొకటి నాకు బోధపడినది. శాక్తేయులూ వామాచారులూ రామనుజకూటస్థులూ చాలామంది ఆ ఊళ్లో ఉన్నా రనుకొన్నాను. ఒక శాస్త్రుర్లుగారు మడిబట్టలు కట్టుకొని మొగమునిండా కుంకుమబొట్టు పెట్టుకొని రాగి జారీచెంబు చేతితో పట్టుకొని కాళ్ళు ఎత్తెత్తి వేసుకొంటూ ఆదారిని వెళ్లుతున్నాడు. నేను ఆయనకు నమస్కారము చేసి కుశలప్రశ్న అడగబోయినానో లేదో "లేలే దూరంగా దూరంగా. ఊరుఅంతా మాలకూడు తీసుకువచ్చి కలుపుతున్నారు. ఒక నియమం లేదు. ఒక వ్యాకరణం లేదు- ఒక ఛందస్సు లేదు—వీళ్ళబొంద. దూరంగా వెళ్లు—" అని ఆయనే నన్ను కుశలప్రశ్న చేసినాడు. కిక్కురు మనకుండా తలవంచుకొని దూరముగా తొలిగిపోయినాను. ఇదేమి శాక్తేయమతము దేవుడా! వ్యాకరణ మంటాడు, ఛందస్సంటాడు, తిడతాడు, అని ఆశ్చర్యపడ్డాను.

గండభేరుండంచు పంచె కట్టుకొని నఖశిఖ పర్యంతమూ నామాలు ఒత్తుగా పెట్టుకొని ఒక ఆచార్యులుగారు తాంబూలము వేసుకుంటూ ఒక వేశ్యకు మంత్రోపదేశము చేస్తున్నాడు. ఏమిటి చెప్మా ఈ మంత్రమని ఆలోచించి రామానుజకూటములో రహస్యాలు భేదించడానికి సామాన్యమానవులకు దుస్తరమని అనుకొంటూ ఉండగా ఆయన బిగ్గరగా ‘‘అక్కడ అరసున్న ఏదు! మరిచావా అర్ధానుస్వారనిఘంటు వప్పుడే పోతున్నది, తగులబడి పోతున్నది! ఎంతని మొత్తుకొనేది ? కవిత్వానికల్లా శృంగారరసం ప్రధానంకదా. చెపితే కవిత్వం వేశ్య చెప్పాలి, అని నేను ఎంత అఘోరించినా ఏ అరసున్నో ఏ బండిరాఓ వదలిపెట్టి కవిత్వాన్ని చంపేశేస్తున్నావు!’’ అని ఆపిడమీాద కోపపడుతున్నాడు.

ఆఊళ్లో చాలామంది ఈ మాదిరిజనము ఉండడము కనిపెట్టినాను. నేననుకొన్నట్టు వాళ్లు శాక్తేయులూకారు, రామానుజకూటస్థులూకారు. అయితే మరి యెవరని ప్రశ్న వచ్చింది. మరి యెవళ్లో అయితే ఈ కుంఖంబోళ్లేమిటి ? ఈ యెర్రబడ్డ కళ్ళేమిటి? ఈ పంగనామము లేమిటి ? ఈ గంధాక్షతలపూత లేమిటి ? ఈ మడికట్టుకోడా లేమిటి? అనిపించింది.

ఆలోచించగా ఒకసంగతిస్ఫురించింది. మతవిషయాలలో వామాచారమూ రామానుజకూటమూ బయలుదేరదీసినట్లే భాషావిషయములోకూడా తత్తుల్యమైన ఒకకూటము బయలుదేరదీశారు కాబోలు ఈ ఊళ్లో బుద్ధిమంతులు అనుకొన్నాను. చూచినకొద్దీ నా అభిప్రాయము దృఢపడ్డది. దీనిసంగతి సందర్భాలు తెలుసుకోవలెనని నాకు ఇచ్ఛపుట్టింది. అందుకోసము

ఒక శాస్త్రుల్లుగారి స్నేహము చేశాను. ఆయన కిష్టప్ప శాస్త్రుల్లు గారు. శాస్త్రుల్లుగారు సరసులు. కొంతమంది కవిత్వమంటే చెవికోసుకొంటారు. ఆయన చెవే కాకుండా ముక్కూ చేతులూ కాళ్ళూ వగైరా అవయవాలు కోసుకొంటారు. అందుచేతేనే నేను ఆయన్ను పట్టాను. ఆయన పరిచయము కోసము కష్టపడి ఒకపద్యము కూడా సంపాదించాను.

అసలు కిష్టప్ప శాస్త్రుల్లుగారు కవిత్వముకోసము మడి మాన్యాలు అమ్మివేశారు. ఆయన కష్టపడి వ్రాసిన కొన్ని పద్యాలు మాత్రము వార్ధకములో మిగిలినవి. అవే సంతానముగా అవే ఆస్తిగా అవే సిరీ సంపత్తుగా ఆయన చూచుకొంటున్నారు. ఆ పద్యాలను పురస్కరించుకొని ఆయన భాషకు సంబంధించిన రామానుజ కూటములో ప్రవేశించిన మాటవిని ఆయనను ఆశ్రయించాను. నేను కిష్టప్ప శాస్త్రుల్లు గారు ఆ కూటానికి మూలవిరాట్టు లయినారు. ఆయనను ఆశ్రయిస్తే నాకు లభ్యము కాని దేమిటి?

ఒకనాడు ఉదయమే నేను మడి కట్టుకొని గంధాక్షతలు ఒత్తుగా పెట్టుకొని పూర్ణానుస్వారవంటి తావళాలు మెళ్లో వేసుకొని, చేతిలో అప్పకవీయము బాల వ్యాకరణము కవి కంఠపాశమూ పట్టుకొని కిష్టప్ప శాస్త్రుల్లుగారి యింటికి వెళ్ళి నాను. తోవలో కనిపించిన కత్తిరింపు జుట్టు కుర్రవాళ్ళను చూచి దూరముగా తొలిగిపోయి వాళ్ళను నాలుగుతిట్టి వాళ్లచేత నాలుగుపడి శాస్త్రుల్లుగారింటికివచ్చి కాళ్లుకడుక్కొని ఆచమనము చేసి, సంగతిఅంతా ఆయనతో క్రమముగా చెప్పినాను.

ఇంట్లో ప్రవేశించగానే ఆయనకు మొదట అమాంత ముగా సాష్టాంగప్రణామముచేసి సున్నాలపన్నము ఏక రువు పెట్టినాను. నన్ను కూచోబెట్టి ఆయన నాబళ్లు నిమిరి దీవించారు. నాసంగతి సందర్భాలు నేను చెప్పకముందే ఆయన ఇలా ప్రారంభించారు :-

"విన్నారండీ, కలికాలమాహాత్యము ! రాజన్నవాడు అపరాధులను దండించకపోతే అటువంటివాడు ఉండిన నేమి తాను మఱి యూడిననేమి ధరాతలంబునన్ ఏమంటారు ? మాట్లాడ రేం ? "

"చిత్తం చిత్తం" అన్నాను నేను.

"దేశద్రోహమే ద్రోహమా ? భాషాద్రోహం ద్రోహం కాదూ ? మాట్లాడ రేం ? "

"చిత్తం చిత్తం."

"తగల బెట్టేస్తున్నారు భాషని ! అరసున్న లక్కరలేదట, శకటరేఫలు—ఊఁ. మాట్లాడ రేం ? "

"చిత్తం చిత్తం."

"నేనే రాజునైతేనా వీళ్లందరికీ ద్వీపాంతరవాస శిక్ష వేతును, వీళ్ళను కొరత వేయింతును ! "

"చిత్తం, తప్పకుండా చేయించేవా రే."

"మరి మనలోమాట. నే నొక్కప్రశ్న అడుగుతాను, చెప్పండి. అందరూ జట్కాబండి జట్కాబండి అంటారుగదా నిజంగా అది జట్కాబండా ? "

"నాకు తెలియదు. తమరే సెలవియ్యాలి."

"అదినిజంగాజట్కాబండికాదు అవునంటారాకాదంటారా?"

"తమరు సెలవిచ్చాక ఎందు కవుతుంది ?"

"అది చట్కా-బండి అండీ. సరళాదేశమువల్ల వచ్చిన జకారాన్ని పట్టుకొని.... మాట్లాడ రేం ?"

"చిత్తం పూర్వకవులుకూడా, అందులో కవిత్రయము వారు ముఖ్యంగా వాడారని తోస్తుంది."

"వాడరుటండీ ? మీకు చాదస్తమా యేమిటి ? చట్కా-బండిమీద పెట్టి ఈవాదమంతా కావ్యం వ్రాస్తున్నాను. విన్నారా ?"

"చిత్తం."

"ఈ అల్లరి సజ్జు కుర్రవాళ్ళను గురించి మొన్న ఒక ప్రహసనం వ్రాశాను. చిత్తగించారా ?"

"చిత్తం చిత్తం."

"వాళ్ళంతా తల నేలకు వేసి కొట్టుకోవా లన్నమాట- ఏదో కవిత్వంటండీ, దానిపేరు నాకు రాకుండా ఉంది. దాని బొంద! అదిటండి ఈకాలంలోకవిత్వమనిపించుకుంటోందట."

"చిత్తం చిత్తం."

"మీరు గాని వాళ్ళను మీదరిమానాకు రానివ్వకండి సుమీ."

"చిత్తం చిత్తం. ఎంతమాట సెలవిచ్చారు! వాళ్ళ మూలాన నాకు రోజుకు నాలుగైదుమార్లు స్నానం తప్పడం లేదు."

"అవును. ఇప్పు డంతా తెలుగు మీరి పోతున్నారు. ఈ వార్ధక్యంలో స్నానాలు చెయ్యలేక నేను ఇల్లు కదలడమే లేదు ఈ మధ్య."

"చిత్తం చిత్తం తమరు ఈ మధ్య వ్రాయించిన దిగ్విజయయాత్ర బహు ఆనందముతో చదివాను."

"ఆలాగటండీ. చెప్పారుకారు. శ్రీపతి దిగ్విజయము సుమండీ అది."

"చిత్తం చిత్తం. ఫణితి బహు రమ్యంగాఉంది."

"ఆఁ. అదీ అదీ. అయితే మీరు మారామానుజకూటంలో ప్రవేశించారా లేదా ?"

"లేదు. తమబోటివారి పరిచర్య కొంతకాలం చేసిన తర్వాత—"

"బాగుబాగు. రోజూ వస్తూ ఉండండి. సద్గ్రంధకాలక్షేపం చేయవచ్చును."

"చిత్తం చిత్తం. చూచారండీ ఈ పద్యం ఎవరో పూర్వకవి వ్రాసిందండి. తమబోటివారికి చూపించి స్వారస్యము గ్రహింతామని—"

"ఏదీ చదవండి."

"కంధరము ధరము ధరమును
కంధరధర ధరము ధరము కచ కుచ కటి వా
క్సింధురమా సింధుర మా
సింధురమా వైభవంబు చెలికిం జూడన్."

"ఓహో ఏమిపద్యమండీ, ఏమి తెలుగండీ, ఏమి కవిత్వమండీ, ఏమి కవిత్వమండీ!"

"మహాదొడ్డ కవిత్వమనే నేను—"

"ఓహోహో, ఏమి పసతన మున్నకవిత్వమండి ! ఏమి శబ్దసౌష్ఠవము, ఏమి అర్థగాంభీర్యము, ఏమి జటిలత ! ఎక్కడ

సంపాదించారో కాని మూదొడ్డ పద్యమండీ. పోనివ్వకండి. పద్యం భద్రంగా దాచండి."

"చిత్తం చిత్తం."

"ఇటువంటి కవిత్వం ఉండగా తగుదునమ్మా అని ఈ కాలంలో కుర్రకుంకలంతా—ఊఁ మాటాడరేం ?"

"చిత్తం చిత్తం,"

"ఇష్టం వచ్చినట్టు తగలేస్తున్నారండీ భాషనంతానూ."

"ఎన్నివిపరీతాలేనా పుట్టుతున్నాయండీ ఈకలికాలంలో"

"సరే. ఈమారు ఈపద్యం సంగతి చూతాము నిఘంటువులు అటకమీద ఉన్నవి లెండి, అవి తీయించిన మీదట—"

"చిత్తం చిత్తం."

"మీరు వెళ్ళి స్నానం చెయ్యండి మరిచిపోక. నేనూ స్నానానికి లేస్తున్నాను. చెప్పరాని వాళ్ళను గురించి చాలా మాట్లాడు కొన్నాం. స్నానం చేస్తే నే గాని ...."

"చిత్తం చిత్తం."

౨

నాకు కిష్టప్పశాస్త్రుల్లుగారి పరిచయలాభము కలిగినతర్వాత క్రమక్రమముగా కూటస్థుల పరిచయము కూడా కలిగింది. కూటములో ముఖ్యముగా చెప్పతగ్గవారు చిట్టెయ్యగారు. అసలు ఈకూటాన్ని స్థాపించింది ఈయనే అని వదంతి. డబ్బాలు చేయించడమూ వాయించడమూ ఈయనకు బాగా తెలుసును. ప్రపంచములో డబ్బా మొట్టమొదట కనిపెట్టిన మహానుభావు డీయనే అని చెప్పుకొంటారు. ఈయన మొదట తనడబ్బా వాయించినపుడు ఆధ్వనిమాధుర్యము గ్రహించి

మిగిలినవా ళ్ళందరూ డబ్బాలు వాయించడము నేర్చుకొన్నారు; ఈ డబ్బాభాషతోనే మాట్లాడుకోవడము నేర్చుకొంటున్నారు.

ఇంతే కాకుండా ఈయన ముచ్చిబొమ్మలు చేయగల నేర్పు కలవాడుకూడాను. ఈయన చేసినబొమ్మలలో ముఖ్యముగా ఎన్నతగ్గది సరస్వతీవిగ్రహము. ఆవిగ్రహము చాలా సొగసైన దని పండితులు చెప్పుకొంటూరు. చూతామంటే విగ్రహాకారము కనబడదు. ముస్తాబు - దుస్తులు, అలంకారాలు, రంగులు - విస్తారముగా ఉండడముమూలాన అసలు విగ్రహము ఎటువంటిదో ఇంతవరకు ఎవరూ చూచి ఉండ లేదు : ముస్తాబు చూచినవారే అందరూను. ఆవిగ్రహము జీవకళలతో ఉట్టిపడుతూ ఉన్నదని మొదట చెప్పి తర్వాత అది నిజముగా సజీవ అయిన సరస్వతీ అని నిర్ణయించినారు వారిశిష్యులు. ఈకూటానికి చిట్టయ్యే మూలపురుషుడు. కాబట్టి ఈయనను అందరూ పూజిస్తారు.

తరువాత కూటకార్యములు సరిగా నడిపించడానికి శ్రీరాములు మేస్త్రీ ఉన్నాడు. ఆయన చాలా గడుసువాడు. పిల్లిమీాద ఎలుకనూ ఎలుకమీాద పిల్లినీ ఎక్కించి సర్కసు చేయించే నేర్పుకలవాడు. లాభము లేని వ్యవహారము చేసినవాడుకాడు ఎన్నడూను. చాలాకాలమునుంచి మేస్త్రీగా తరిఫీతయినమనిషి. డబ్బాలు వాయింపించడములోనూ ముచ్చిబొమ్మలు చేయించడములోనూ ముచ్చిబొమ్మలకు మొక్కుబళ్ళు చెల్లింపించడములోనూ శ్రీరాములు మేస్త్రీకి మించిన చెయ్యిలేదు. ఆయన ఆమధ్య డబ్బా వాయించడము

నేర్చుకోడానికి ప్రయత్నము చేశాడు, కాని ఆపని ఆయనకు చేతకాలేదు. సరస్వతీ విగ్రహాలు చేయించడముకోసమని అక్కడో యెముకా అక్కడో యెముకా సంపాదించి ఆయన చిట్టెయ్య శిష్యులకు ఇస్తూఉంటాడు; ఆ యెముకలు కూర్చి వాళ్ళు విగ్రహముగా ఏర్పాటుచేసి దాన్ని పూజించుకొంటూ ఉండేటట్టు చేస్తాడు. శ్రీరాములుమేస్త్రీ పలుకుబడి కలవాడు, మాటకారి. ఆయనకు ఆశ్రయము ఉన్నది. ఏదో మిష పెట్టి రెండురాళ్ళు సంపాదించుకొంటున్నాడు. తనను ఆశ్రయించినవాళ్ళకు రెండురాళ్ళు ఎవరిచేతనైనా ముట్టజెప్పిస్తూ ఉంటాడుకూడాను.

ఆయనగాక పురోహితుడు వెంకటావధానులొకాయన ఉన్నాడు కూటములో – మనిషి చాలా ఆచారవంతుడు. అసలు పుట్టడములోనే మడిగా పుట్టినాడు ఆ మహానుభావుడు మడిగా బతుకుకొంటూ వస్తున్నాడు. మడిగా ముసిలితనము గడుపుతున్నాడు. ప్రపంచములో మడికట్టుకొన్నవాళ్ళు ఎవళ్ళయినా ఉన్నారా అంటే వేలుమడిచి చెప్పుకోదగ్గ మనిషి వెంకటావధానులు. ఆయన చాలా తెలిసినవాడని చాలామంది చెప్పుకొంటారు. నలభీమ పాకాలను మించి ఉంటుందట ఆయన కవిత్వపాకము! పైకి మడికట్టుకొన్నట్టు కనిపించినా క్రియకు చాలామార్లు ఆయన మడికట్టుకోనివాళ్ళు చేసేపనులు చేసినాడని నిదర్శనాలున్నవి. మడిమాట ఒక మూలపెట్టి మాట్లాడితే, వెంకటావధానులు మొత్తముమీద చాలా సరసుడని చెప్పుకోవచ్చును.

ఈయన కాక ప్రతిసభలోనూ అగ్రతాంబూలము స్వీక

రించే సుబ్బయ్య ఒకాయన ఉన్నాడు. ఆయన చిట్టెయ్య శిష్యుడు. చిట్టెయ్య డబ్బాను చూచి ఆ పంపిణీ మార్చి ఒక మోస్తరు కొత్తడబ్బా చేయించి దానిని వాయిస్తూ ఉంటాడాయన. డబ్బా భాషతోనే దేవుణ్ణి కొలవాలనీ అలా చేస్తే దేవుడు ప్రత్యక్షమవుతాడనీ ఆయన ఆశయము. ఇతర భాషలు దేవునికి ప్రీతికరము కావట. సుబ్బయ్య భక్తుడు. అందుచేతనే అగ్రతాంబూలాలు పుచ్చుకోవడము.

కూటస్థ ప్రధానపురుషులలో ఒక రయిన లక్ష్మీనగసు సంగతి ఇక చెప్పవలసి ఉన్నది. ఆయన లెక్కలేనన్ని పూర్వ జన్మలెత్తినాడు. అన్నిజన్మలలోనూ అత్తగారై పుట్టి అధికారము చెలాయించి చెలాయించి ఈజన్మలో లక్ష్మీనరసుగా అవతరించి పూర్వవాసన ఏ మాత్రమూ పోనివ్వకుండా కాపాడుకొంటూ కర్రపెత్తనము చేస్తూ ఉంటాడు. ఆయన ప్రపంచాన్నంతనూ తనకోడలుగా భావించి ఆకోడలిని ఎపుడూ అత్తగారి సాధింపులు సాధిస్తూ ఉంటాడు. చేటలతో చెరిగి దుమ్మెత్తి పోయగల నేర్పు ఆయనకు బాగా ఉన్నది. లక్ష్మీనరుసుకు వచ్చినతిట్లకూ శాపనాకారాలకూ మితి లేదు. ఆయన నాలుక నాలుక కాదు — కొరడా. కొత్తసరుకు తెచ్చి దానిమీద పాతసరుకని ముద్రవేసి చెలామణీ చేయించడములో ఆయన అందరినీ మించిన చెయ్యి.

పేరుగాక ఆశ్రితులు వగైరాలు చాలామంది ఈ కూటములో ఉన్నారు. వారందరితోనూ పరిచయము చేసుకొన్నాను. చేసుకొని వారి మందిరానికి రాకపోకలు చేస్తూ ఉండేవాడను. కూటమువారు సమావేశమయ్యే మందిర

ములో ఒక చీకటికొట్టు ఉన్నది. ఆకొట్లో ఉన్నది సరస్వతి విగ్రహము. ఈ బొమ్మను పూజచేయడానికీ, కంచుకోత్సవమువంటి ఉత్సవాలు జరపడానికీ కూటస్థులందరూ మందిరములో సమావేశమవుతూ ఉంటారు. ఎపుడు వెళ్ళిచూచినా మందిరములో ఎవరో కొందరు కూటస్థులు ఏదో ఒకపని చేస్తూ ఉంటారు. కొందరు చిట్టెయ్య శిష్యులను ఆశ్రయించి ముచ్చిబొమ్మలు చెయ్యడము నేర్చుకొంటూ ఉంటారు. చీకటికొట్టులో బొమ్మను పూజించడమే కాకుండా ఎవరి విగ్రహము వారు చేసుకొని ఎవరిడబ్బా వారు వాయిస్తూ పూజ చేసుకొంటూ ఉంటారు. పార్థివలింగపూజ చేసేవాళ్లు ఏరోజు లింగము ఆరోజు చేసుకొన్నట్లే వీరిలో కొందరు ఏరోజుబొమ్మ ఆరోజు చేసుకొంటూ ఉంటారుకూడాను.

మరికొందరు ఎప్పుడూ ప్రాయశ్చిత్తము చేయించుకొంటూ మందిరములో ఉండడము మనము చూడవచ్చును. వర్ణసంకరులతో సహవాసము చేసినందుకూ, వాగ్దోషము వచ్చినందుకూ——అనగా పుటలో వెయ్యవలసినన్ని అర్థానుస్వారలు, శకటరేఫలు వెయ్యనందుకూ——వీరు ప్రాయశ్చిత్తము చేయించుకొంటూ ఉంటారు. అందుకోసమై కూటము వారు రెండు ఆవులనుకూడా పెంచుతున్నారు. మరికొందరు మేస్త్రీ నాశ్రయించి ఎముకలకొరకూ రాళ్ళకొరకూ దేవులాడుతూ ఉంటారు. మరికొందరు స్నానాలు చేస్తూనో మడి కట్టుకొంటూనో పుండ్రములు ధరించుకొంటూనో ఉంటారు.

చీకటిగదిలో బొమ్మను చూడాలని బుద్ధి పుట్టి ఆసంగతి కిష్టప్పశాస్త్రుల్లుగారితో ప్రశంసించాను.

“ఆఁ. తప్పూ తప్పూ! విగ్రహము చూస్తే చాలా దోషం! కళ్లుపోతవి! మనపని ఎంతసేపూ పూజ చెయ్యడమేకాని లోపల ఏముంది బయట ఏముంది అని తర్కం ప్రారంభించ గూడదు. ఏమంటావు ?” అన్నాడాయన.

“చిత్తం చిత్తం.”

“చెప్పలేదూ భగవద్గీతలో—ఎంతసేపూ మనధర్మము మనము నిర్వర్తిస్తూ ఉండవలెను. ఫలము కోరకూడదు. హేతువాదాలు పెట్టుకొనుటవల్ల ఏమీ లాభము లేదు. మాట్లాడవేం? అవునా కాదా?”

“చిత్తం చిత్తం.”

“మేలిముసుగులో ఏముందో అనీ, చీకటి గదిలో ఏముందో అనీ, మనము కాలము వ్యర్థము చేసుకోగూడదు. అదంతా చిదంబరరహస్యముగా చూచుకోవాలి. అవునా కాదా ?”

“చిత్తం చిత్తం.”

“విన్నావూ చట్కాబండీకావ్యము సగము అయింది సుమా ....”

ఈరీతిగా ఆయన కథలోకి దిగినారు. ఇంక వీళ్ళను అడిగితే లాభము లేదనుకొని బాల్యచాపలము జయించలేక రహస్యభేదనము చేతామని ఊహించాను. ఎవరూ లేకుండా చూచి ఒకనాడు గదిలో ప్రవేశించి దీపము వెలిగించి చూచాను. కొట్టులో చాలా విగ్రహాలున్నవి. విగ్రహాలంటే విగ్రహాలుకావు; విగ్రహాకారముతో ఉన్న రంగురంగుల చీరలూ, ముచ్చి బంగారుతో చేసిన ఆభరణాలూ.

అన్నిటికన్నా పెద్ద విగ్రహమొకటి ఒకపీఠముమీాద ఉన్నది. అదే చిట్టెయ్య చేసిన విగ్రహమని తోచింది. దానికి దక్షిణాది చీరలు దిట్టముగా కట్టబెట్టినారు. పాతసరుకు కరిగించి చేసిన నగలుకూడా ఉన్నవి. పై వేషముమాట కేమి, అసలు విగ్రహ మెంత అందముగా ఉన్నదో చూతామని పరీక్షించాను. అసలు విగ్రహము లేదు. పదకొండో శతాబ్దము మొదలుకొని నేటివరకూ దొరికిన యెముకలూ, చేత యెముకలూ మాత్రమున్నవి. ముక్కూ చెవులూ ఉన్నవో లేవో. కళ్ళు అసలే లేవు. విగ్రహానికి వాహనము శకటరేఖా కారముగా ఉన్నది. కిరీటము సున్నలతోనూ అర సున్నలతోనూ రమ్యముగా చేసినాడు.

విగ్రహా లన్నీ దీని పుత్రికలే. తేడా మాత్రము కొంచెమున్నది. సంపాదించిన యెముకలలో గాని, స్వయముగా చేసిన యెముకలలో గాని పాతకొత్తల తేడా ఒకటీ, కిరీటాకారాలలో తేడా ఒకటీ. అది కాక చీరలలో తారతమ్యము బాగా కనిపిస్తున్నది. కొందరు దక్షిణాది చీరలు తమవిగ్రహాలకు కట్టినారు; కొందరు ఈకాలపు ఉప్పాడ చీరెలు చుట్టబెట్టినారు; కొందరు నెల్లూరు పుట్టములు కట్టినారు; కొందరు చిత్తూరు ఖద్దరు బట్టలు చుట్టబెట్టినారు. తూట్లు పడ్డపూర్వకాలపు బట్టలు కప్పినారు కొందరు.

ఆగదిలోనేపూజాద్రవ్యములుకూడాఉన్నవి. చేతపువ్వులూ, కాకితాలతో చేసిన పత్రివగైరావస్తువులు ఏమేమో ఉన్నవి.

చిదంబర రహస్యము తెలిసినది. ప్రపంచములో ఎటువంటి వింతలైనా ఉంటవి; ఎంతటి బుద్ధిమంతులైనా ఉంటా

రని ఆశ్చర్యపోయినాను. కూటము సంగతి సందర్భములు తెలిసినవికదా ఇక ఆ ఊరు విడిచివెళ్లవలెనని ఊహించాను. కాని కూటము సాంవత్సరికోత్సవము నేడో రేపో జరగబోతున్నదని విని ఆవింతకూడా చూతామని ఆగిపోయినాను.

౪

వార్షికోత్సవము సమీపించినదనగానే కూటస్థులందరూ ఒక్కమారు ప్రాయశ్చిత్తము చేయించుకొన్నారు. పాచి చేసుకోడానికి పొరిగిండ్లవారికి కాస్త గోమయమయినా దొరకలేదు. ప్రాయశ్చిత్త మయిపోయినతర్వాత కొందరు చిట్టెయ్యనాశ్రయించి కొత్తకొత్త డబ్బాలూ డప్పాలూ చేయించుకొన్నారు. శ్రీరాములు మేస్త్రీ బాజా భజంత్రీలను సిద్ధముచేసినాడు. ఆనాటికని కొత్తకొత్తగా సంపాదించిన ఎముకలతో కొత్తకొత్త బొమ్మలు తయారుచేశారు. అనాచారవంతుల నందరినీ నోటికి వచ్చినట్టు తిట్టడానికి లక్ష్మీనర్సును నియమించారు. అందుకోసమని ఆయన కత్తులూ కఠార్లూ తయారుచేస్తున్నాడు. గ్రామ్యు లందరికీ చిల్లంగిపెట్టి ప్రయోగము చేస్తానని కిష్టప్ప శాస్త్రుల్లుగారు పూనుకొన్నారు. అందుకోసమని ఆయన కొంతకాలము వరకూ చటూ-కావ్య రచన కట్టిపెట్టినాడు. శ్రీరాములుమేస్త్రీ పైహంగు యావత్తూ చేస్తున్నాడు. ఈరూపముగా రెండురాళ్ళు కొట్టుకొందామని బతుకుతెలివి కలవాళ్ళు ఆయనను ఆశ్రయించారు. కొత్త వాళ్ళను కూటములో చేర్చుకొనడానికి చాలా ప్రయత్నాలు జరిగినవి. నన్ను కూటములో చేరమని కిష్టప్పశాస్త్రుల్లు చాలా బలవంతపెట్టినాడు. "ఇంకా తమవంటివారి శుశ్రూష

కొంతకాలము చేస్తేనేగాని అంతపదవికి తగ"నని నేను సమాధానము చెప్పినాను. నేను కూటములో చేరితే నాకు కోశాధ్యక్షపదవి ఇప్పిస్తాననీ, నాచేత పుస్తకాలు వ్రాయించి టెక్స్టుబుక్కులుగా పెట్టించి లాభము వచ్చేటట్టు చేస్తాననీ శ్రీరాములుమేస్త్రీ చాలాచాలా చెప్పినాడు. కాని నాకు ప్రాప్తము ఉండవద్దూ!

కూటస్థులలో ప్రసిద్ధులూ, కూటము మీద సానుభూతి గల తత్తుల్యులూ ఆనాడు వ్యాసాలు చదవడానికి ఒప్పు కొన్నారు. కొంతమంది వ్యాసాలు సంస్కృతములోనూ, కొందరు పద్యరూపముగాను, కొందరు గద్య చిత్ర బంధ కవిత్వముతోనూ, కొంతమంది శ్లేషయమకాదులతోనూ బహుచక్కగా భారత మంతేసి గ్రంథములు వ్రాసి యిచ్చి నారు శ్రీరాములు మేస్త్రీకి. ఆయన వాటన్నింటినీ పరీక్షించి చూచి ఆంధ్రదేశము వాఙ్మయవిషయములో వెనుకంజ వెయ్యడము లేదు గదా అని సంతోషించినాడు. ఆవ్యాస ములలో విషయము లివి.

౧. గ్రాంథిక కృతకవాణీ కూట ప్రాశస్త్యము.

౨. తొమ్మిదవ శతాబ్దమున ఎముక లున్నవా?

౩. టిట్టెయ్య జన్మస్థానమునకు సంబంధించిన కంపునదీ చరిత్ర.

౪. కుసుమలు పండుటకు ఎట్టియెరువు ఉపయోగించ వలెను?

౫. అర్ధచంద్రాకృతి గల అర్ధానుస్వారధారిణి యగు ఆంధ్రభాషాయోష చంద్రముఖి కాదా?

౬. ఆంధ్రమందున్న అన్యభాషాపదముల నేల తొలగింప రాదు ?

౭. చచ్చుము శబ్ద సాధుత్వా సాధుత్వములు.

౮. దోమకు కన్ను లున్నవా ?

౯. కిరసనాయిలు నూనె.

౧౦. ప్రపంచ భాషలయం దాంధ్రమున కెట్టిస్థానము లభ్యము కాగలదో కిష్టప్పగారి కావ్యములనుబట్టి నిర్ణయించుట.

ఈ వ్యాసములు చదివేవారు ప్రౌఢకవి భయంకరులూ, కవిసమ్రాట్టులూ, సాహిత్యాంబుధులూ. కూటము వారే ఉభయఖర్చును పెట్టుకొని వీరందరినీ పిలిపించినారు.

వస్తుంది వస్తుంది అనుకొన్న వార్షికదినము వచ్చింది. తద్దినమున వారందరికీ ఫెళ్ళుమని పిండివంటలతో భోజనాలు పెట్టినారు. ఆంధ్ర దేశములో భాషాభిమానులయిన సంపన్నులకు లోటు లేదు గదా! ఇక సంతర్పణలకు లోటు వస్తుందా? రోజుకు రెండు మూడుసార్లు ఫలహారాలు మొదలయిన వన్నీ జరిగినవి. ఈ భోజనపు తొందరలో వ్యాసాలసంగతి అందరూ మరిచిపోయినారు. అందరికీ భోజనాలు ఫలహారము చెయ్యడమువల్ల అక్కడ ప్రత్యేకముగా ఏర్పాటుకాబడ్డ ఆంధ్ర భిషగ్వైద్యశాలకు కావలసినంతపని తగిలింది.

"చదవకపోతే ఏమిలెండి—వ్యాసాలు తర్వాత అచ్చు వేసుకోవచ్చును గదా" అన్నాడు శ్రీరాములు మేస్త్రీ.

ఏది జరిగినా ఏది జరగకపోయినా ఆనాడు సరస్వతీపూజ మాత్రము చాలా బాగా జరిగింది. ఎవరి విగ్రహాన్ని వారు

పూజించుకొన్న తరువాత అందరూ కలిసి నృత్యము చేస్తూ చిట్టెయ్య విగ్రహాన్ని పూజించారు. కిష్టప్పశాస్త్రుల్లు మంత్రాలు చతువుతున్నాడు. వెంకటావధానులు పౌరోహిత్యము వహించినాడు. సుబ్బయ్య అగ్రతాంబూలముకోసము తంటాలు పడుతున్నాడు. లక్ష్మీనర్సు తిట్టుతున్నాడు.

"వాయించవోయి మేస్త్రీ, డబ్బాలు బాగా వాయించు. ఏయి బాజాభజంత్రీలు, డబ్బాలు బాగా వాయించండి. కట్నాలు పుచ్చుకోండి. తెండి, ఇలా తెండి. వెయ్యండి, అడుగు బాగా వెయ్యండి." ఇత్యాది కోలాహలముతో సరస్వతీ పూజ బహు చక్కగా జరిగింది. ఆగందరగోళములో కూటస్థు లందరికీ ఒళ్ళు గరిపొడిచింది. కొందరికి ఒళ్ళు తెలియలేదు. కొందరు ఆవేశము వల్ల మూర్ఛ పోయినారు.

చివరకు అందరూ సరస్వతీ మంత్రము చదివినారు. ఎవరి మట్టుకు వారు మంత్రము జపించే సాంప్రదాయము లే దక్కడ. కూటస్థు లందరూ కలిసి గ్రాంధిక వాణీస్తోత్ర మహామంత్రము జపము చేశారు. నాకు జ్ఞాపక మున్నంత వరకూ వివరిస్తున్నాను.

అస్య శ్రీవాణీస్తోత్ర మహామంత్రస్య చిన్నయ సూరీ ఋషిః । అప్పకవీయంఛందః । గ్రాంధిక కృతకవాణీ దేవతా। కవి రాక్షసీయం బీజం । సంస్కృతపండిత వాదః శక్తిః । ధనార్జనం కీలకం । మమ గ్రాంధిక వాణీ సేవనద్వారా మహారాజప్రసాద సిద్ధ్యర్థం జపే వినియోగః ॥

వచ్చుము చచ్చుము రూపిణీం అంగుష్ఠాభ్యాం నమః । మీరు చేసిరి మయూం తర్జనీభ్యాం నమః । పూర్ణార్ధబిందు

స్వరూపిణీం మధ్యమాభ్యాం నమః । కుంతురునకు బొంబాయి నకు పోషిణీం అనామికాభ్యాం నమః । నావుడు అనవుడు పదశరణ్యాం కరతల కరపృష్ఠాభ్యాం నమః ॥

ఏవం హృదయాదిన్యాసః । కవిత్రయనామ్నా గ్రామ్య వాదినాం వాగ్బంధః ॥

ధ్యానమ్

గ్రంథవాణీం కీర్తిదాత్రీం
శబ్దాలంకార శోభితామ్ ।
వ్యావహారిక శబ్దానాం
ఖండనీం పండితావనీమ్ ॥

తరువాత మంత్రము జపించారు. అంగన్యాసములలో ఇమిడిఉన్న బీజాక్షరాలే కాబట్టి వేరే మంత్రము వ్రాయ లేదు. అందరూ ఈ మంత్రము అష్టోత్తరశతము జపము చేశారు. చివరకు ఫలశ్రుతి—

గ్రంథ వాణ్యా ఇదం స్తోత్రం
యః పఠే ద్రాజసన్నిధౌ ।
సిధ్యన్తి సర్వకార్యాణి
పండితః కథ్యతే ధ్రువమ్ ॥

ఇదంతా అయిన తర్వాత అందరూ సొమ్మసిల్లి పడి పోయినారు.

* * *

అప్పుడు జరిగింది గొప్పవింత ! మందిరమంతా నిశ్శబ్ద ముగా ఉన్నది. అపుడు వా రున్నతావుకు దివ్యసుందరవిగ్ర హము వచ్చింది. ఆ చూపులు, నడకలు, ఆ చిరునవ్వు, ఆ

ఒయ్యారము - భయమూ భక్తీ, వాత్సల్యమూ అనురాగమూ కలిగిస్తున్నవి. ఆవిడ అందరి హృదయాలనూ ఆకర్షించే శక్తిగల దివ్యస్త్రీ. ఆవిడను చూచి అందరూ హృదయాలామె కప్పచెప్పినారు. అందరికీ మనశ్శాంతి కలిగింది.

ఉత్సాహము కలిగింది. ఆనందము కలిగింది.

సృష్టికర్త సృష్టీకూడా అవిడే!

ఆమె ధరించినవి పువ్వులూ చివుళ్ళూ.

ఆమెస్నేహితులు పిల్లలు.

ఆమె పలుకుతున్నవి చిలకపలుకులు.

ఆవిడకంఠము కోకిల.

ఆవిడకన్నులు తేటనీటి బుగ్గలు.

ఆవిడపైటవిసురు మందమారుతము.

ఆవిడకిరీటము ఆకాశము.

కిరీటములో మణులు చుక్కలు.

ఆవిడ సరస్వతి!

సొమ్మసిల్లి పోయిన జన మంతా లేచి నిలుచున్నారు. "ఎవరు నీవు? కూటస్థుల రహస్య మందిరములోకి ఎందుకు వచ్చావు?" అని ఆవిడను వారంతా గద్దించారు.

ఆవిడ నవ్వింది. ఆవిడకళ్లు జబాబు చెప్పినవి — నేను సరస్వతి నని. వాళ్ళంతా ఒకమారు ఆవిడ కేసి చూచారు, ఒకమారు చిట్టెయ్య విగ్రహము కేసి చూచారు. అన్నారు అందరూనూ; "ఆఁ ఆఁ! ఏమిటి ఏమిటీ! నీవు సరస్వతి వయితే ఈ విగ్రహం ఏమి కావలసింది? కలికాలంలో ఎంతటివాళ్లయినా ఉంటారు!"

శ్రీరాములు మేస్త్రీ కిష్టప్పశాస్త్రుల్లుకేసి చూచినాడు. ఆయన లక్ష్మీనరుసును పరామర్శ చేసినాడు. ఆయన మేస్త్రీకి సైగ చేసినాడు. మేస్త్రీ అన్నాడు "చూస్తారేం ఇంకా!"

అందరూ కలసి డబ్బాలు వాయించారు. కొందరు కర్రలు తీసుకు వచ్చారు—ఆవిడను జడిపించారు.

ఆవిడ అంతర్ధానమయింది. నాటినుంచి నేటివరకూ కిష్టప్ప శాస్త్రుల్లు లక్ష్మీనరుసూ ఆవిడను అడ్డమైనతిట్లు తిట్టుతూనే ఉన్నారు.

కాని ఆవిడ ఆ ఊళ్ళో పిల్లలతో ఎప్పుడూ ఆడుకొంటూ ఉంటుందనీ, వాళ్ళకు కావలసిన ఆటవస్తువులు ఇస్తూ ఉంటుందనీ వినికిడి.

*

షరా:— గ్రాంధికవాణీ స్తోత్రము తాము చదివినది కాదనీ, నేను కల్పించినదనీ, కిష్టప్పశాస్త్రుల్లుగారు నన్ను శపిస్తూ ఒక కావ్యం వ్రాస్తున్నారట. ఈమధ్య కిష్టప్పశాస్త్రుల్లుగారికీ నాకూ అభిప్రాయ భేదం కలిగింది లేండి.

కిష్టప్పశాస్త్రుల్లుగారితో అభిప్రాయ భేదం అంటే ప్రబల శత్రుత్వ మన్నమాట.

1923